RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జులు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006 9494220260


ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక - 51 పేజీలు - 04 వెల - 04/- మంగళవారం 26 నవంబర్ 2024

# పిపిపి పద్ధతిలో స్టేట్ రోడ్లు



- ప్రైవేట్ రంగంలో ప్రాజెక్టులు, రోడ్లు
- నిర్మాన నిర్వహణ ఇక సులభతరం
- టోల్ వసూలుతో నిర్వహణా భారం
- ఎపిలో ప్రయోగాత్మక అమలుకు నిర్ణయం



అమరావతి,నవంబర్25ఆంధ్ర ప్రగతి: తెలుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు పబ్లిక్,ప్రైవేటు పార్టనర్ షిప్ గురించి ఇటీవలి కాలంలో బాగా ఫోకస్ పెడుతున్నారు. శీఘ్రగతిన అభివృద్ధితో పాటు,ప్రజల భాగస్వామ్యం ఉండేలా చూస్తున్నారు. ఇప్పటి వరకూ ఈ మోడల్ కొన్ని విభాగాల్లో అమలు చేస్తున్నారు. జాతీయ రహదారుల తరహాలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో రోడ్ల నిర్వహణను అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీకి అప్పగించాలని చంద్రబాబు యోచిస్తున్నారు. వారు టోల్ ఫీజు వసూలు చేసుకుంటారు. ఉభయ గోదావరి జిల్లాల్లోని రోడ్లపైన పైలట్ ప్రాజెక్టుగా టోల్‌గేట్లు ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు అసెంబ్లీలో చెప్పారు. ఈ క్రమంలో చంద్రబాబు ఏపీలో అభివృద్ధి పనులకు ఈ మోడల్ అనుసరించాలనుకుంటున్నారు. అంటే రోడ్లను ప్రైవేటు కంపెనీలతో వేయిస్తారు. ప్రజల నుంచి టోల్ వసూలు చేస్తారు. ఇప్పటి వరకూ జాతీయ రహదారుల్లో ఈ విధానం ఉంది. ఇప్పుడు రాష్ట్ర రహదారులకూ తీసుకు వస్తారు. అలాగే గోదావరి నీటిని బనకచర్ల వరకూ తీసుకెళ్లేందుకూ ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానిస్తున్నారు. ఇందుకు రూ. 70వేల కోట్లు ఖర్చవుతాయి. అంటే ఆ డబ్బులూ ప్రజలు కట్టాల్సిందే. మండల కేంద్రం నుంచి జిల్లా కేంద్రానికి, జిల్లా కేంద్రం నుంచి రాష్ట్ర,జాతీయ రహదారులకు వెళ్లే మార్గాల్లో టోల్‌గేట్లు ఏర్పాట్లు చేయాలని భావిస్తున్నట్లు సిఎం తెలిపారు. వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు తానే పిపిపి పద్ధతిలో జాతీయ రహదారుల అభివృద్ధి ప్రతిపాదన చేశానని అప్పట్లో తనను అందరూ వ్యతిరేకించారని, కానీఇప్పుడు దేశ వ్యాప్తంగా నాలుగు, ఆరు, ఎనిమిది, 14 లైన్ల జాతీయ రహదారులు కూడా వచ్చాయన గుర్తు చేసుకున్నారు. మిగతాది 2లో...

# విపక్షాల రచ్చతో పార్లమెంట్ వాయిదా

- పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభం..
- ప్రతిపక్ష ఎంపీల నినాదాల మధ్య ఉభయ సభలు రోజంతా వాయిదా
- బుధవారం తిరిగి ప్రారంభమవనున్న సమావేశాలు
- రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం విరామం



న్యూఢిల్లీ,నవంబర్25ఆంధ్ర ప్రగతి: పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమయ్యాయి. విపక్షాల నినాదాల మధ్య లోక్‌సభ, రాజ్యసభల్లో ప్రొసీడింగ్స్ మొదలయ్యాయి. అయితే అదానీ లంచం వ్యవహారంపై చర్చ చేపట్టాలంటూ విపక్ష ఎంపీలు నినాదాలు చేయడంతో ఉభయ సభలు ఒక రోజంతా వాయిదా పడ్డాయి. దీంతో ఉభయ సభలు తిరిగి బుధవారం ప్రారంభమవనున్నాయి. సమావేశాలు ప్రారంభమవగానే ప్రతిపక్ష పార్టీల ఎంపీలు నినాదాలు మొదలుపెట్టారు. దీంతో నిమిషాల వ్యవధిలోనే మధ్యాహ్నం 12 గంటలకు సభలు వాయిదాపడ్డాయి. తిరిగి ప్రారంభమైన తర్వాత కూడా నినాదాలు కొనసాగడంతో ఒక రోజంతా వాయిపడ్డాయి. రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మంగళవారం లోక్‌సభ, రాజ్యసభ సమావేశాలను నిర్వహించడం లేదని ఒక ప్రకటన ద్వారా వెల్లడించారు.

పార్లమెంట్ శీతాకాల సమావేశాల ప్రారంభానికి ముందు పార్లమెంట్ హౌస్‌లో సభలో విపక్షాల వ్యూహాన్ని నిర్ణయించేందుకు ఇండియా కూటమికి చెందిన పార్టీల ఫ్లోర్ లీడర్లు సమావేశమయ్యారు. 'మణిపూర్ అంశాన్ని ఉభయ సభల్లో లేవనెత్తాలని కోరామని కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ తెలిపారు. మణిపూర్‌లో శాంతిభద్రతలతో పాటు దేశంలో నిరుద్యోగ సమస్య, ఉత్తర భారతంలో కాలుష్య పరిస్థితితో పాటు పలు అంశాలపై మాట్లాడతామన్నారు. మరోవైపు జాయింట్ పార్లమెంటరీ కమిటీ పదవీకాలాన్ని పొడిగించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను అభ్యర్థించాయి. కమిటీ తన పరిధిలోని కీలకమైన విషయాలను క్షుణ్ణంగా పరిశోధించి, చర్చించడానికి మరింత సమయాన్ని ఇవ్వాలని కోరాయి.

కాగా ఈ పార్లమెంట్ సమావేశాలు డిసెంబర్ 20 వరకు కొనసాగనున్నాయి. వక్ఫ్ చట్టం (సవరణ) బిల్లుతో సహా పలు కీలక బిల్లులపై చర్చించనున్నారు. పార్లమెంట్ పరిశీలన కోసం ప్రభుత్వం మొత్తం 16 బిల్లులను లిస్టింగ్ చేసింది.




## రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో ఎస్పీకి సుప్రీంలో ఎదురుదెబ్బ..!




## డైరెక్టర్ రాంగోపాల్ వర్మ అరెస్టుకు రంగం సిద్ధం

# చిక్కీల్లో సైతం డబ్బులు కాజేసిన జగన్

- సుద్దపూసలా కబుర్లు చెప్పడం వింతగా ఉంది
- గత ఐదేళ్లలో విద్యా వ్యవస్థను నాశనం చేశారు
- జగన్ కు మంత్రి నారా లోకేశ్ స్ట్రాంగ్ కౌంటర్



అమరావతి,నవంబర్25ఆంధ్ర ప్రగతి: ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంపై జగన్, లోకేష్ మధ్య సోషల్ మీడియా వేదికగా వార్ నడిచింది. కూటమి ప్రభుత్వ వచ్చినప్పటి నుంచి ఫీజు రీయింబర్స్ చేయలేదని జగన్ విమర్శలు చేస్తే .. చిన్న పిల్లలకు అందించే చిక్కీల్లో సైతం డబ్బులు ఎగ్గొట్టిన వైసీపీ అధినేత జగన్ ఇప్పుడు సుద్దపూసలా కబుర్లు చెప్పడం వింతగా ఉందని మంత్రి నారా లోకేశ్ కౌంటర్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోందన్న జగన్ విమర్శలపై ట్విట్టర్ వేదికగా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ ట్విట్టర్ వేదికగా విమర్శలు చేశారు. మిగతాది 2లో...

# అర్ధరాత్రి అనుమతుల వెనుక దర్యాప్తు జరగాలి

- జగన్ -అదానీ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి
- సీఎం చంద్రబాబుకు వైఎస్ షర్మిల బహిరంగ లేఖ



అమరావతి,నవంబర్25ఆంధ్ర ప్రగతి: మాజీ సీఎం జగన్ అదానీతో చేసుకున్న విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలను రద్దు చేయాలని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం చంద్రబాబుకు ఆమె బహిరంగ లేఖ రాశారు. మిగతాది 2లో...

# విద్యార్థులపై కక్షకట్టిన చంద్రబాబు

- విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోంది
- కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో తిరోగమనం
- విద్యారంగాన్ని దారుణంగా దెబ్బతీశారు
- 11 లక్షల మంది విద్యార్థులకు ఇబ్బంది
- 12,609 కోట్లు ఒక్క విద్యాదీవెనకే ఖర్చు చేశాం
- ఎన్నికల కోడ్ కారణంగా ఇవ్వలేకపోయాం
- డిసెంబర్ నాటికి 3500 కోట్ల బకాయిలు
- ప్రభుత్వంపై ట్విట్టర్ వేదికగా వైఎస్ జగన్ విమర్శలు



అమరావతి,నవంబర్25ఆంధ్ర ప్రగతి: ఆంధ్రప్రదేశ్‌లో ఫీజు రీయింబర్స్‌మెంట్ అందక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ప్రభుత్వంపై మాజీ ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ ట్విట్టర్ వేదికగా విమర్శలు చేశారు. జగన్ ఏం పోస్టు చేశారంటే"కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతోంది. మూడు త్రైమాసికాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ డబ్బులు చెల్లించకపోవడంతో చదువులు మానుకోవాల్సిన పరిస్థితులు వచ్చాయి. వారిపై చంద్రబాబు కక్షకట్టినట్టు వ్యవహరిస్తున్నారు. మిగతాది 2లో...

# ఢిల్లీకి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



అమరావతి,నవంబర్25 ఆంధ్ర ప్రగతి: ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఢిల్లీ వెళ్లారు. ఆయన ఎవరితో అయినా సమావేశం అవుతారా లేదా అన్న దానిపై స్పష్టత లేదు. అయితే లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఇంట్లో జరగనున్న ఓ శుభకార్యంలో పాల్గొనే అవకాశం ఉంది. ప్రైవేటు కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్నారు మిగతాది 2లో...

# ఈ 29న ప్రధాని మోదీ విశాఖ పర్యటన రద్దు

## తుపాను హెచ్చరికలతో ప్రధాని పర్యటన రద్దు



అమరావతి, నవంబర్25ఆంధ్ర ప్రగతి: ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ పర్యటన పర్యటన రద్దయింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారుతుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో ప్రధాని మోదీ విశాఖ పర్యటన రద్దు చేసుకున్నారు. షెడ్యూల్ ప్రకారం నవంబర్ 29న ప్రధాని మోదీ విశాఖలో పర్యటించాల్సి ఉంది. అయితే ప్రతికూల వాతావరణ హెచ్చరికలతో మిగతాది 2లో...

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# ఈ 29న ప్రధాని మోదీ విశాఖ పర్యటన రద్దు

(మొదటి పేజి తరువాయి)

మోదీ పర్యటన రద్దు అయినట్లు పీఎంవో తెలిపింది. అనకాపల్లి పూడిమడకలోని ఎన్టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ హబ్ శంకుస్థాపనతో పాటు జాతీయ రహదారుల అంకితం, కొన్ని రైల్వే ప్రాజెక్టులను ప్రధాని మోదీ జాతికి అంకితం చేయాల్సి ఉంది. ఈ పర్యటనలో భాగంగా విశాఖలోని ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ స్టేడియంలో లక్ష మందితో భారీ బహిరంగ సభ సైతం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, తీవ్ర వాయుగుండంగా మారుతోంది. అనంతరం అది తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించడంతో ప్రధాని మోదీ విశాఖ పర్యటన రద్దు చేసినట్లు ప్రధాని కార్యాలయం సోమవారం వెల్లడించింది.

# చిక్కీల్లో సైతం డబ్బులు కాజేసిన జగన్

(మొదటి పేజి తరువాయి)

వారిపై చంద్రబాబు కక్షకట్టినట్టు వ్యవహరిస్తున్నారు. ఒంగోలు జిల్లా జె.పంగులూరులో ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక, ఫీజులు కట్టలేక పనులకు వెళ్తున్న విద్యార్థి కథనం ఆవేదన కలిగించింది." అని దానికి సంబంధించిన పేపర్ క్లిప్పింగ్ కూడా పోస్టు చేశారు. అసలు విద్యార్థులకు డబ్బులు ఎగ్గొట్టిన వైసీపీ అధినేత జగన్ ఇప్పుడు సుద్దపూసలా కబుర్లు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు మంత్రి నారా లోకేష్. మీ నిర్వాకాన్ని నా యువగళం పాదయాత్రలోనే విద్యార్థులు నా దృష్టికి తెచ్చారు. వారికి ఇచ్చిన హామీ మేరకు ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకొని సమస్య పరిష్కరించాం. గత ప్రభుత్వ బకాయిలను విడతల వారీగా చెల్లిస్తామని, విద్యార్థుల సర్టిఫికెట్లను తక్షణమే అందజేయాల్సిందిగా కళాశాలలను ఆదేశించాం. ఇకపై ఫీజు రీఎంబర్స్ మెంట్ సొమ్మును నేరుగా కళాశాలలకు చెల్లించేలా ఇటీవలే నిర్ణయం కూడా తీసుకున్నాం.' అని మంత్రి పేర్కొన్నారు.'గత ఐదేళ్లలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించారు. మీ అనాలోచిత, అవినీతి విధానాల కారణంగా రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లల్లో 4 లక్షల మంది విద్యార్థులు తగ్గిపోయిన విషయం వాస్తవం కాదా?. ఉపాధ్యాయులు, విద్యార్థులను సిద్ధం చెయ్యకుండానే సీబీఎస్ఈ పరీక్షా విధానం తీసుకొచ్చారు. నీ నిర్ణయాలు బ్లైండ్‌గా ఫాలో అయితే ఆ పిల్లలంతా బోర్డు పరీక్షల్లో తప్పి డిప్రెషన్‌లోకి వెళ్లేవారు. ఉపాధ్యాయుల బోధనా సామర్థ్యం పెంచకుండా, టోఫెల్, ఐబీ శిక్షణ ఇచ్చేవారు లేకపోయినా అమలు చేశామని డబ్బా కొట్టుకోవడం. ఇలా ఒక్కటేంటి విద్యా వ్యవస్థను నాశనం చేసిన పాపం మీదే.' అంటూ లోకేశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.నాడు – నేడు అంటూ పబ్లిసిటీ పీక్‌కు తీసుకెళ్లారు కానీ విషయం వీక్ అని తేలిందని లోకేశ్ మండిపడ్డారు. వైసీపీ హయాంలో పాఠశాలల్లో బల్లలు, తాగునీరు, టాయిలెట్లు వంటి కనీస సౌకర్యాలు కల్పించలేదని ధ్వజమెత్తారు. తన క్షేత్రస్థాయి పర్యటనల్లో ఈ విషయం స్పష్టమైందని చెప్పారు. ఇక ట్యాబులు ఇంటికి ఇవ్వడం వల్ల జరుగుతున్న అనర్థాలను మీరు నేరుగా తల్లిదండ్రులనే అడిగి తెలుసుకోవచ్చని అన్నారు. 'మీరు చేసిన విధ్వంసాన్ని ఒక్కొక్కటిగా సరి చేస్తూ ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాం. పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపర్చేందుకు ఖాళీగా ఉన్న 16,347 టీచర్ పోస్టులను మెగా డీఎస్సీతో భర్తీ చేసే ప్రక్రియను ఇప్పటికే ప్రారంభించాం. విద్యార్థులు, తల్లిదండ్రులకు ఇబ్బంది లేకుండా విద్యాదీవెన, వసతిదీవెన స్థానంలో పాత ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేసి తీరుతాం. రాబోయే ఐదేళ్లలో ఏపీ విద్యా రంగాన్ని దేశానికే తలమానికంగా తీర్చిదిద్దాలని చంద్రబాబు గారి నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం సంకల్పించింది. మీలాంటి మారీచులు ఎంత తప్పుడు ప్రచారం చేసినా విద్యా రంగ సంస్కరణల విషయంలో మా అడుగు ముందుకే!' అని లోకేశ్ ట్విట్‌లో పేర్కొన్నారు.

# రఘురామ కస్టోడియల్ టార్చర్ కేసులో ఎస్పీకి సుప్రీంలో ఎదురుదెబ్బ..!

అమరావతి,నవంబర్25ఆంధ్ర ప్రగతి: ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కస్టోడియల్ టార్చర్ కేసులో సీఐడీ మాజీ అదనపు ఎస్పీ విజయ్ పాల్ కు ఎదురుదెబ్బ తగిలింది. తనపై ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో బెయిల్ మంజూరు చేయాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు విజయ్ పాల్. సుదీర్ఘ వాదనల అనంతరం జస్టిస్ విక్రమ్ నాత్, జస్టిస్ ప్రసన్న ధర్మాసనం పిటిషన్ ను కొట్టివేసింది. కస్టోడియల్ టార్చరే జరగలేదని, అరెస్ట్ వ్యవహారంతో తన క్లయింట్ విజయ్ పాల్ కు ఎలాంటి సంబంధం లేదని సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి వాదించారు. దీనికి రఘురామకృష్ణరాజు న్యాయవాది కౌంటర్ ఇచ్చారు. ఇరు పక్షాల వాదనలు విన్న సుప్రీంకోర్టు ధర్మాసనం బెయిల్ పిటిషన్ ను కొట్టివేసింది. సుప్రీంకోర్టు తీర్పుపై రఘురామకృష్ణరాజు హర్షం వ్యక్తం చేశారు. "సుమారు 55 నిమిషాల వాదనలు, ప్రతి వాదనలు జరిగాయి. ఆ తర్వాత ఇవాళ ఫైనల్ గా సుప్రీంకోర్టులో బెంచ్ నెంబర్ 6, ఐటెమ్ నెంబర్ 6.. విజయ్ పాల్ బెయిల్ పిటిషన్ ను కొట్టివేయడం జరిగింది. నాకు గుర్తు లేదు, నేను మర్చిపోయాను అని ఆయన రకరకాల విన్యాసాలతో పోలీసు అధికారులను, విచారణ అధికారులను తికమక చేశారు. మరిప్పుడు చూడాలి. సుమారు 2021 మే 14న జరిగింది. మరిప్పుడు 24లో ఉన్నాం. ఎన్నో సంవత్సరాల తర్వాత.. ఈ న్యాయ పోరాటంలో కచ్చితంగా నేను నెగ్గుతాను అనే పరిపూర్ణ విశ్వాసం అయితే నాకుంది" అని రఘురామకృష్ణరాజు అన్నారు.

# డైరెక్టర్ రాంగోపాల్ వర్మ అరెస్టుకు రంగం సిద్ధం

అమరావతి,నవంబర్25ఆంధ్ర ప్రగతి: ప్రముఖ దర్శకుడు రాంగోపాల్ వర్మ అరెస్టుకు రంగం సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ ఫోటోలు మార్ఫింగ్ చేసి ఎక్స్‌లో పోస్ట్ చేసిన కేసులో రాంగోపాల్ వర్మ విచారణ ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. ఈ విషయంలో ప్రకాశం జిల్లా మద్దిపాడు పీఎస్‌లో కేసు నమోదైంది. అయితే ఈ కేసులో పోలీసుల విచారణకు వర్మ డుమ్మా కొడుతూ వస్తున్నారు. ఈరోజు విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. రాలేనంటూ లాయర్ ద్వారా పోలీసులకు సమాచారం పంపారు. దీంతో రంగంలోకి దిగిన ఒంగోలు పోలీసులు సరాసరి హైదరాబాద్‌లోని ఆర్జీవీ ఇంటికి వెళ్లారు. ఆయన్ని అరెస్ట్ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ముందుగా ఈ కేసులో నవంబర్ 19 (మంగళవారం)న విచారణకు హాజరుకావాల్సి ఉండగా.. డుమ్మా కొట్టాడు. సినిమా షూటింగ్‌లో బిజీగా ఉండటం వల్ల విచారణకు రాలేనని ఒంగోలు రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్ బాబుకు వాట్సాప్‌లో రాంగోపాల్ వర్మ మెసేజ్ పెట్టాడు. విచారణకు సహకరిస్తానని, వారం రోజులు గడువు ఇవ్వాలని పోలీసులను కోరాడు. దీంతో పోలీసులు వర్మకు మరోసారి నోటీసులు జారీ చేశారు. సోమవారం విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే, ఈ సారి కూడా డుమ్మా కొట్టడంతో పోలీసులు నేరుగా వర్మ ఇంటికి వెళ్లారు.

# ఢిల్లీకి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

(మొదటి పేజి తరువాయి)

కాబట్టి అధికారికంగా ప్రకటించలేదని అంటున్నారు. డిప్యూటీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత పవన్ కల్యాణ్ రెండో సారి ఢిల్లీ వెళ్తున్నారు. కొద్ది రోజుల కిందట ఆయన ఢిల్లీ వెళ్లి అమిత్ షాతో సమావేశం అయ్యారు. మహారాష్ట్ర ఎన్నికల్లో ప్రచారం కోసం ఆయనను అమిత్ షా పిలిచినట్లుగా తెలుస్తోంది. ఆ తర్వాత ఇప్పుడు మరోసారి ఢిల్లీ వెళ్తున్నారు. పవన్ కల్యాణ్ ఢిల్లీలో రాజకీయ పరమైన సమావేశాలు జరిపే అవకాశం లేదేని అలాగే.. ప్రభుత్వం తరపున డిప్యూటీ సీఎంగా కేంద్ర మంత్రుల్ని.. కూడా కలిసే అవకాశం లేదని ఈ ఢిల్లీ పర్యటన పూర్తిగా వ్యక్తిగతమైనదేనని జనసేన వర్గాలు చెబుతున్నాయి. పవన్ కల్యాణ్ ఇటీవలి కాలంలో ఎన్డీఏకు కీలక మిత్రపక్షంగా వ్యవహరిస్తున్నారు. మహారాష్ట్రలో చురుకుగా ప్రచారం చేయడంతో ఆయన ప్రచారం చేసిన అన్ని ప్రాంతాల్లోనూ అభ్యర్థులు మంచి విజయం సాధించారు. ఈ అంశంపై ఆయన ఎప్పుడూ నేరుగా బీజేపీ నేతలతో సంప్రదింపులు జరపలేదు. ప్రత్యేకంగా వారాహి డిక్లరేషన్ ను కూడా ప్రకటించారు. తమిళనాడులో డీఎంకే రాజకీయ వారుసజిగా పేరు తెచ్చుకున్న యువనేత, డిప్యూటీ సీఎం ఉదయనిధి స్టాలిన్ విమర్శలు గుప్పించారు. తరపున హిందుత్వ వాదాన్ని తమిళనాడులో వినిపించేందుకు పవన్ ను ఉపయోగించుకుంటారన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# అర్ధరాత్రి అనుమతుల వెనుక దర్యాప్తు జరగాలి

## జగన్ -అదానీ విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి - సీఎం చంద్రబాబుకు వైఎస్ షర్మిల బహిరంగ లేఖ

(మొదటి పేజి తరువాయి)

అదానీతో ఒప్పందం రాష్ట్రానికి పెను భారమని.. ఈ అక్రమ ఒప్పందాలతో 25 ఏళ్ల పాటు పాటు ప్రజలపై రూ.లక్షన్నర కోట్ల భారం పడుతుందని అన్నారు. 'విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందంలో గౌతమ్ అదానీ నుంచి రూ.1750 కోట్ల ముడుపులు అందుకున్న జగన్‌పై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సీబీఐతో లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి. ఈ విషయంలో లంచాలు తీసుకున్నట్లు ఇప్పటికే అమెరికాకు చెందిన దర్యాప్తు సంస్థలు నిరూపించాయి. జగన్ ఏపీ పరువును తీశారు. లంచాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారు. అదానీ దగ్గర నుంచి గుజరాత్ యూనిట్ ధర రూ.1.99 పైసలకు కొంటుంటే, ఏపీ మాత్రం యూనిట్ ధర రూ.2.49 పైసలుగా అగ్రిమెంట్ చేసుకున్నారు.' అని షర్మిల మండిపడ్డారు.

అదానీతో చేసుకున్న విద్యుత్ కొనుగోళ్ల ఒప్పందాలు మొత్తం సీఎంవో నుంచే నడిచాయని.. ఈ విషయాన్ని స్వయంగా అప్పటి విద్యుత్ శాఖ మంత్రి ఒప్పుకొన్నట్లు షర్మిల చెప్పారు. 'ఏపీ విద్యుత్ నియంత్రణ మండలి కూడా ఎలాంటి ప్రజాభిప్రాయం సేకరించకుండా, అదే కంపెనీ ఇతర రాష్ట్రాల్లో చేసుకున్న ఒప్పందాలను పరిశీలించకుండా వెంటనే ఆమోద ముద్ర వేశారు. అర్ధరాత్రి హడావుడిగా చేసిన అనుమతుల వెనుక దర్యాప్తు జరగాలి. అత్యవసరంగా సోలార్ పవర్‌ను కొనాల్సిన అవసరం ఏమొచ్చిందో, నిజానిజాలు ఏంటో రాష్ట్ర ప్రజలకు తెలియాలి. అదానీతో ఒప్పందాల రద్దుతో పాటు కంపెనీని తక్షణమే బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలి. అలాగే 2019 నుంచి 2024 మధ్య అదానీతో జరిగిన ఒప్పందాల మీద పూర్తిగా విచారణ జరగాలి.' అని లేఖలో ప్రస్తావించారు. 'మన దేశం, రాష్ట్రం పరువు తీసేలా అంతర్జాతీయ మార్కెట్‌లో చర్చల మీద చర్చలు జరుగుతున్నాయి. ఇంత జరుగుతున్నా మీ కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్లైనా లేదు. ముడుపుల అంశంలో కనీసం మీరు నోరు విప్పడం లేదు. ఇప్పటికే అమరావతి ఇన్నర్ రింగ్ ప్రాజెక్టుతో పాటూ, రోప్‌వే నిర్మాణం, బీచ్ శాండ్ ఉత్పత్తుల ప్రాజెక్టులు, కొత్తగా సోలార్, హైడ్రో పవర్ ప్రాజెక్టులు అదానీకి కట్టబెట్టేందుకు సన్నాహాలుచేస్తున్నట్లు తెలుస్తోంది. సీఎం గారిని డిమాండ్ చేస్తున్నాం. ముడుపుల వ్యవహారంలో అదానీ కంపెనీ చేసే కుట్ర ఏంటో తేటతెల్లం అయ్యింది. అమెరికా దర్యాప్తు సంస్థల ద్వారా అసలు విషయం బయటపడ్డాక మళ్లీ మీరు కూడా ఆ కంపెనీతోనే ముందుకువెళ్తారా లేక రాష్ట్రంలో అదానీ గ్రూప్స్‌ను బ్లాక్ లిస్ట్‌లో పెడతారా తేల్చుకోవాలి. గంగవరం పోర్టు అదానీకి అమ్మడంపైనా విచారణ జరగాలి. గంగవరం పోర్టు తక్కువ ధరకు కట్టబెట్టడం వెనుక దాగి ఉన్న మర్మమేంటో కూటమి ప్రభుత్వం బయటపెట్టాలి. 2008న అప్పటి ప్రభుత్వం చేసుకున్న ఒప్పందం ప్రకారం గంగవరం పోర్ట్ తిరిగి ప్రభుత్వపరం అయ్యేలా చర్యలు చేపట్టాలి.' అని లేఖలో పేర్కొన్నారు.

# విద్యార్థులపై కక్షకట్టిన చంద్రబాబు

(మొదటి పేజి తరువాయి)

ఒంగోలు జిల్లా జె.పంగులూరులో ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక, ఫీజులు కట్టలేక పనులకు వెళ్తున్న విద్యార్థి కథనం ఆవేదన కలిగించింది." అని దానికి సంబంధించిన పేపర్ క్లిప్పింగ్ కూడా పోస్టు చేశారు. చంద్రబాబు రాగానే అన్ని రంగాల్లోనూ తిరోగమనమే కనిపిస్తోందని విమర్శించారు జగన్. ముఖ్యంగా విద్యారంగాన్ని దారుణంగా దెబ్బతీశారన్నారు. అమ్మ ఒడిని, ఇంగ్లీష్ మీడియంను, 3వ తరగతి నుంచి టోఫెల్, 3వ తరగతి నుంచే సబ్జెక్టు టీచర్లు, సీబీఎస్ఈ, సీబీఎస్ఈ నుంచి ఐబీ దాకా ప్రయాణం, 8వ తరగతి పిల్లలకు ట్యాబులు, బైజూస్ కంటెంట్, నాడు–నేడు ఇలా అన్నింటినీ రద్దుచేసిందన్నారు. 1–12వ తరగతి విద్యార్థులను, వారి తల్లులను కూడా దెబ్బతీశారని ధ్వజమెత్తారు. వసతిదీవెన, విద్యాదీవెన నిలిపేసి, డిగ్రీ, ఇంజినీరింగ్, డాక్టర్ చదువుతున్నవారినీ ఇబ్బందిపెడుతున్నారని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రతి త్రైమాసికం పూర్తికాగానే తల్లుల ఖాతాలో జమచేసే వాళ్లమని అన్నారు. ఇలా గత విద్యాసంవత్సరం డిసెంబర్ త్రైమాసికం వరకూ రూ. 12,609 కోట్లు ఒక్క విద్యాదీవెనకే ఖర్చు చేశామని తెలిపారు. తలరాతలను మార్చేది చదువులు మాత్రమేనని గట్టిగా నమ్ముతూ వైయస్సార్‌సీపీ హయాంలో మొత్తం ఈ రెండు పథకాలకే రూ.18వేల కోట్లు వరకూ ఖర్చు చేశామని గుర్తు చేశారు. ఎన్నికల కోడ్ కారణంగా జనవరి–మార్చి త్రైమాసికానికి, ఏప్రిల్‌లో వెరిఫికేషన్ చేసి మే నెలలో ఇవ్వాల్సిన ఫీజు డబ్బులు వేయనీయకుండా కూటమి పార్టీలు ఈసీకి ఫిర్యాదు చేశాయన్నారు. పోనీ ఎన్నికలైన తర్వాత జూన్‌లో అయినా ఇచ్చారా అంటే అదీలేదన్నారు. ఏప్రిల్‌లో ఇవ్వాల్సిన వసతి దీవెన, ఏప్రిల్–జూన్, తర్వాత జులై–సెప్టెంబరు త్రైమాసికాలకు సంబంధించి ఫీజులు చెల్లింపులో అడుగూ ముందుకు పడ్డంలేదన్నారు. ఇప్పుడు అక్టోబరు–డిసెంబరు త్రైమాసికం కూడా సగం గడిచిపోయిందన్నారు. సుమారు రూ.2,800 కోట్లకుపైగా ఫీజులు రీయింబర్స్ చేయాల్సి ఉందని వివరించారు. మరో రూ.1,100 కోట్లు వసతిదీవెన బకాయిలు ఉన్నాయన్నారు. మొత్తంగా డిసెంబర్ నాటికి రూ.3,900 కోట్లకు చేరుకుంటాయని తెలిపారు. కానీ, ఈ ప్రభుత్వం తీరు చూస్తే మాటలేమో కోటలు దాటుతున్నాయి, కాళ్లేమో గడపకూడా దాటడం లేదు అన్నట్టు ఉందని విమర్శించారు. ఫీజులు కట్టక 11 లక్షల మంది విద్యార్థులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారన్నారు. తల్లిదండ్రులు అప్పులు చేయడమో, వాటిని తీర్చలేక ఆస్తులు అమ్ముకోవడమో చేయాల్సి వస్తోందన్నారు. ఏ దారీలేనివారు తమ పిల్లలను పనులకు తీసుకెళ్తున్నారు. చదువులకు నిలయమైన ఏపీలో దౌర్భాగ్యకర పరిస్థితులు ఇవి అంటూ విమర్శలు చేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక రూ.6,500 కోట్ల రీయింబర్స్‌మెంట్ బకాయిలను తీర్చిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని మార్చి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడింది వైసీపీ ప్రభుత్వమేనని మండిపడ్డారు. 'అధికారంలో ఉన్నప్పుడు బాధ్యతారాహిత్యంగా ఉండి ప్రతిపక్షంలోకి రాగానే విలువలు వల్లించడం మీకే చెల్లింది. విద్యా దీవెన, వసతి దీవెన పేరుతో రూ.3500 కోట్లు బకాయిలు పెట్టి మోసం చేసిన కారణంగానే సర్టిఫికెట్లు రాక లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని అన్నారు.

# ఎవరి మెప్పుకోసమో సెకీ ఒప్పందంపై మాట్లాడలేదు

**మరోసారి మీడియా ముందుకు బాలినేని**

**వైసీపీ నేత చెవిరెడ్డికి సవాల్**

**సీఎండీ దస్త్రం కూడా తన వద్దకు రాలేదని వెల్లడి**

**వైసీపీ నుంచి ఎందుకు బయటకు వచ్చానో చర్చకు సిద్ధమని వ్యాఖ్య**

**దమ్మంటే చర్చకు రావాలంటూ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి సవాలు**

**చిత్తూరు జిల్లా నేతను తీసుకొచ్చి ఒంగోలులో నిలబెట్టడం నచ్చలేదని వెల్లడి**



అమరావతి,నవంబర్25ఆంధ్ర ప్రగతి:
సెకీతో సౌరవిద్యుత్ ఒప్పందం అంశంలో తనకు ఏమాత్రం సంబంధం లేదని ఏపీ విద్యుత్ శాఖ మాజీ మంత్రి, జనసేన నేత బాలినేని శ్రీనివాస్ రెడ్డి పునరుద్ఘాటించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మెప్పుకోసమే తాను సెకీ ఒప్పందంపై మాట్లాడానని విమర్శిస్తున్నారని, ఎవరి మెప్పు కోసమో తాను పనిచేయడం లేదని గుర్తుపెట్టుకోవాలని బాలినేని అన్నారు. సెకీతో ఒప్పందానికి సంబంధించి సీఎండీ దస్త్రం కూడా తన వద్దకు రాలేదన్నారు. వైసీపీ నేత చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఆయన కౌంటర్ ఇచ్చారు. తాను వ్యక్తిగత విమర్శలు చేస్తే ఎవరూ తట్టుకోలేరని, తాను వైసీపీ నుంచి ఎందుకు బయటకు రావాల్సి వచ్చిందో మొత్తం చెబుతానని, ధైర్యం ఉంటే చర్చకు రావాలని చెవిరెడ్డి భాస్కర్ రెడ్డికి ఆయన సవాల్ చేశారు.

రాజశేఖర్ రెడ్డి కుటుంబం వల్లే తాను పైకి వచ్చానంటూ మాట్లాడుతున్నారని, వైఎస్సే రాజకీయ భిక్ష పెట్టారని జనసేనలో చేరినప్పుడు తానే మీడియా ముఖంగా చెప్పానని బాలినేని శ్రీనివాస్ రెడ్డి ప్రస్తావించారు. "నేను విలువలు లేని రాజకీయాలు చేసే వ్యక్తిని కాదు. వైఎస్‌పై అభిమానంతోనే మంత్రి పదవి వదులుకొని జగన్ పార్టీలోకి వెళ్లా. రాజశేఖర్ రెడ్డి మరణించాక మంత్రి పదవి, ఎమ్మెల్యే పదవిని వదులుకున్నా. పవన్ వెంట ఉండి కూటమితో కలిసి పనిచేసేందుకు నేను సిద్ధంగా ఉన్నాను" అని ఆయన స్పష్టం చేశారు.

షర్మిల, విజయమ్మ వైఎస్ కుటుంబం కాదా?

రాజశేఖర్ రెడ్డి కుటుంబం అంటే ఒక్క జగన్ మోహన్ రెడ్డేనా అని బాలినేని ప్రశ్నించారు. "షర్మిల, విజయమ్మ కాదా?. షర్మిల, విజయమ్మపై పోస్టులు పెడితే రాజశేఖర్ రెడ్డి కుటుంబం కానట్లు ఏమీ పట్టించుకోరా?" అని అన్నారు. "తిట్టేవాళ్లకే టికెట్లు ఇస్తామనే సంప్రదాయం ఎవరు కొనసాగిస్తున్నారో తెలుసు. చిత్తూరు జిల్లా అధ్యక్షుడిని తీసుకొచ్చి ఒంగోలులో టికెట్ ఇస్తారా?. ఒంగోలులో పోటీ చేసే నాయకుడే లేరని చిత్తూరు జిల్లా నుంచి తెచ్చారా?. చిత్తూరు జిల్లా నుంచి తీసుకొచ్చి నిలబెట్టడం నాకు నచ్చలేదు. అందుకే ఒప్పుకోలేదు" అని ఆయన అన్నారు.

కాగా గౌతమ్ అదానీపై అమెరికాలో నమోదయిన లంచం అభియోగాలకు సంబంధించి.. సెకీతో ఏపీ సౌరవిద్యుత్ ఒప్పందంపై ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంపై నాటి విద్యుత్‌శాఖ మంత్రి, ప్రస్తుతం జనసేనలో ఉన్న బాలినేని శ్రీనివాసరెడ్డి ఇటీవలే మీడియా సమావేశం నిర్వహించారు. సెకీ ఒప్పందం వెనుక ఇంత మతలబు ఉందని ఆనాడు ఊహించలేదని సందేహం వ్యక్తం చేశారు. అప్పట్లో ఇంధనశాఖ కార్యదర్శిగా పనిచేసిన శ్రీకాంత్ ఒక రోజు అర్ధరాత్రి ఒంటిగంటకు ఫోన్ చేసి సెకీతో ఒప్పంద పత్రాలపై సంతకం చేయమన్నారని, అనుమానం రావడంతో తాను చేయలేదని, ఆ తర్వాత కేబినెట్‌లో పెట్టి ఆమోదింపజేసుకున్నారని బాలినేని వెల్లడించారు.

# పి పి పి పద్ధతిలో స్టేట్ రోడ్లు

(మొదటి పేజి తరువాయి)

గోదావరి నీటిని పెన్నాకు తరలించడానికి నదుల అనుసంధాన ప్రాజెక్టును చంద్రబాబు పరిశీలిస్తున్నారు. కృష్ణా నదికి తరలించిన గోదావరి మిగులు జలాలను ప్రకాశం బ్యారేజీ సమీపంలోని వైకుంఠపురం కు తరలిస్తారు. అక్కడ ప్రకాశం బ్యారేజీ తరహాలో బ్యారేజీ నిర్మిస్తారు. అక్కడి నుంచి బొల్లాపల్లికి తరలించేలా ప్రణాళిక రూపొందించారు. బొల్లాపల్లి రిజర్వాయరు నుంచి నల్లమల మీదుగా బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు గోదావరి జలాలను తరలించేలా జల వనరుల శాఖ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. ఈ పథకాన్ని అమలు చేయడం వల్ల 22 టీఎంసీలను వెలిగొండ ప్రాజెక్టుకు సరఫరా చేయవచ్చని చెబుతున్నారు. ఇక బనకచర్ల కాంప్లెక్స్ నుంచి తెలుగు గంగ, గాలేరు–నగరి, హంద్రీనీవా ప్రాజెక్టులకు 140 టీఎంసీలను తరలించవచ్చని భావిస్తున్నారు. మొత్తంగా బొల్లాపల్లి రిజర్వాయర్ నుంచి బనకచర్ల హెడ్‌రెగ్యులేటర్‌కు 180 టీఎంసీల గోదావరి జలాలను తరలించే వీలుంది. ఈ ప్రాజెక్టు చేపట్టాలంటే రూ.70 వేల కోట్లు కావాలి. అంత మొత్తం ప్రభుత్వం వద్ద ఉండదు. అందుకే చంద్రబాబు ఖఖఖ మోడల్ గురించి ఆలోచిస్తున్నారు. రోడ్లు, ప్రాజెక్టులు ప్రైవేటు, ప్రభుత్వ పార్టనర్ షిప్‌లో ప్రాజెక్టుల్ని నిర్మిస్తారు. ఆ ప్రాజెక్టు ద్వారా ఆయా కంపెనీలు ఆదాయం సంపాదించుకునే మార్గాలు చూపిస్తారు. టోల్ వసూలు చేస్తారా నీటి తీరువా వసూలు చేస్తారా మరొకటా అన్నది తర్వాత. రైతుల పంటలకు కావాల్సినంత నీరు సదుపాయం వస్తే.. అంత కంటే కావాల్సిందేమీ ఉండదని అంచనా వేస్తున్నారు. ఖఖఖ విధానంతో ఏపీని అభివృద్ధి చేస్తామని చంద్రబాబు ఎన్నికలకు ముందు నుంచీ చెబుతున్నారు . ప్రజల ఆదాయాలను పెంచితే వారు ఈ విధానం ద్వారా మేలు జరిగితే ఎంతో కొంత పన్నులు కట్టేందుకు సిద్ధంగా ఉంటారు. మేలు జరగకపోతే మాత్రం ప్రజా వ్యతిరేకత వచ్చే అవకాశం ఉంటుంది.

# విక్టరీ నంద్యాల ఫెస్టివల్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించిన ఎన్ఎండి ఫిరోజ్.




ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ నవంబర్ 25:
నంద్యాల పట్టణంలోని ప్రథమనంది దేవస్థానం ఆవరణంలో ఏర్పాటుచేసిన విక్టరీ నంద్యాల ఫెస్టివల్ ఎగ్జిబిషన్ నిర్వాహకుడు శ్రీనివాస్ చౌదరి ఆహ్వానం మేరకు ముఖ్యఅతిథిగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొని నూతన హంగులతో , మరి ఎన్నో వెరైటీ లతో ఏర్పాటుచేసిన విక్టరీ నంద్యాల ఫెస్టివల్ ఎగ్జిబిషన్ ను ప్రారంభించడం జరిగింది.
ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ చామకాలువ దగ్గర ప్రథమనందీశ్వర స్వామి దేవస్థానం ఆవరణంలో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయడం చాలా సంతోషకరంగా ఉందని చిన్నపిల్లలు పెద్దలు అందరూ ఆహ్లాదకరంగా ఆడుకునే వస్తువులు ఏర్పాటు చేయడం జరిగిందని . ఈ అవకాశాన్ని నంద్యాల పట్టణ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు . ఈ కార్యక్రమంలో మిట్నాల రవి చౌదరి , చూరి , గఫార్ , నవీన్ , భాస్కర్ , ఖజా తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారిని దర్శించుకున్న హెూమ్ మినిస్టర్.

**-శ్రీశైలం విచ్చేసిన హెూమ్ మినిస్టర్ స్వాగతం పలికిన జిల్లా ఎస్పీ.**




ఆంధ్ర ప్రగతి శ్రీశైలం నవంబర్ 25:
కార్తీక మాసం చివరి సోమవారం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ హెూమ్ మినిస్టర్ శ్రీమతి వంగలపూడి.అనిత శ్రీ శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి వారి దర్శనం నిమిత్తం శ్రీశైలంనకు విచ్చేయడం జరిగింది.ఈ సందర్భంగా హెూమ్ మినిస్టర్ శ్రీ భ్రమరాంబిక అతిథిగృహంనకు చేరుకోగానే జిల్లా సాయుధ బలగాల నుండి గౌరవ వందనం స్వీకరించారు.అనంతరం జిల్లా ఎస్పీ ఆదిరాజ్ సింగ్ రాణా పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.

# విద్యార్థుల నుండి అధిక రుసుములు వసూలు చేస్తే కఠిన చర్యలు.

**-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబర్ 24:
జిల్లాలోని అన్ని జూనియర్ కళాశాలలు, డిగ్రీ కాలేజీలు, ఐటిఐ, పాలిటెక్నిక్ ఇంజనీరింగ్, మెడికల్ కాలేజీలు మరియు ఇతర వృత్తి విద్యా కోర్సు కళాశాలల్లో విద్యార్థుల నుంచి అధిక రుసుములు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.విద్యార్థులు రుసుములు చెల్లించలేదనే కారణంతో హాల్ టికెట్లు జారీ చేయకపోయినా, ఒరిజినల్ ధ్రువపత్రాలు ఇవ్వకపోయినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జ్ఞానభూమి పోర్టల్లో దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి పీజు రీయింబర్స్మెంట్, మెస్ చార్జీలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని కలెక్టర్ వివరించారు. హాల్ టికెట్టు ఇవ్వకపోయినా, ధ్రువపత్రాలు జారీ చేయకపోయినా కలెక్టర్ కార్యాలయములోని కమాండ్ కంట్రోల్ కోఆర్డినేషన్ సెంటర్ ఫోన్ నెంబర్లకు (08514-293903, 08514-293908) ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎన్ఎండి ఫిరోజ్.



ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ నవంబర్ 25:
నంద్యాల పట్టణంలోని ప్రథమనంది దేవస్థాన ఆవరణం నందు కార్తీక మాసం సందర్భంగా ఈర్ల రమణ ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని నంద్యాల టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించడం జరిగింది.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ కార్తీక మాసం నందు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం చాలా సంతోషకరమైన విషయం అని ఎంతో మంది భక్తాతలు ఈ కార్యక్రమం నందు పాల్గొని విజయవంతం చేసినందుకు అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన ఈర్ల రమణ ని అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొండా శ్రీనివాస్ యాదవ్, ఒకటో వార్డు కౌన్సిలర్ నాగార్జున, బి.శివరామ్ , ఈర్ల రామకృష్ణ, ఎం.రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగ సమస్యల పరిష్కారం కై ఉద్యమించండి.

ఆంధ్ర ప్రగతి పాణ్యం నవంబర్ 25:
పాణ్యం మండల పరిధిలో ని అన్ని ప్రభుత్వ పాఠశాల, జూనియర్ మరియు డిగ్రీ కళాశాల సమస్యలు పరిష్కరించాలని స్థానిక తాహసీల్దార్ గారికి వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా పి డి ఎస్ యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.కె జునైద్ భాష ఎన్ ఎస్ యు ఐ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిన ప్రతాప్ సిపిఐ( ఎం ల్ ) న్యూ డెమోక్రసీ పార్టీ ఉమ్మడి కర్నూల్ జిల్లా సహాయ కార దర్శి కె అరుణ్ కుమార్ ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నంద్యాల జిల్లా అధ్యక్షులు మనం వెంకటాద్రి, సమాజ్వాది పార్టీనంద్యాల జిల్లా అధ్యక్షులు పెరుగు శివ కృష్ణ యాదవ్ వారు మాట్లాడుతూ పాణ్యం మండల కేంద్రంలో ఉన్నటువంటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దాదాపుగా



40 సంవత్సరాల క్రితం ఏర్పడింది. నేటి వరకు ఈ పాఠశాలకు కాంపౌండ్ వాల్ లేకపోవడం చాలా హాస్యాస్పదం అన్నారు. మరియుమౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు త్రివ ఇబ్బందులకు గురవుతున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి ఇంటర్మీడియట్, కళాశాల నేడు డిగ్రీ కళాశాలగా ఏర్పడింది.ఇక్కడనుండి ఎంతోమంది ఉన్నత శిఖరాలకు వెళ్లారు. గాని ఈ పాఠశాలమాత్రం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. మరియు మండల పరిధిలోని దాదాపుగా 13 పాఠశాలలకు మౌలిక వసతులు,మరియు కాంపౌండ్ వాల్ లేకపోవడం చాలా చాలా విడ్డూరం, మండలం కేంద్రానికి దగ్గరలో ఉన్న సుగాలిమిట్ట గ్రామం నందు ఏపీ మోడల్ స్కూల్, మరియు ఇవి కేజీబీవీ స్కూలకు కాంపౌండ్ లేదు. కావున సత్వరమే సంబంధిత అధికారులు స్పందించి అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మరియు ప్రాథమిక పాఠశాలలకు మౌలిక వసతులు కాంపౌండ్ వాల్ నిర్మాణ చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు రాజు, వేణు, శ్రీరామ్,రాజేష్ తదితరులు పాల్గొన్నారు

# ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ ఫర్ ఉమెన్ లో
# శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రభంజనం

**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ నవంబర్ 25:**
కర్నాటక రాష్ట్రంలోనీ దార్వర్డ్ లోని ఎస్డిఎం కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ మరియు టెక్నాలజీ లో జరుగుతున్న ఇంటర్ యూనివర్సిటీ సౌత్ జోన్ ఫర్ ఉమెన్ 2024-2025 లో శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల ఐదుగురు మహిళా బ్యాడ్మింటన్ క్రీడాకారులు
1) సిహెచ్. ఎస్సార్ ప్రణవి
2) ఎం. ఆకాంక్ష 3) ఎన్. జాహ్నవి
4) ఎల్.మామైక్య 5) ఎస్.ఫరీహా.
పాల్గొంటున్నారని కళాశాల డైరెక్టర్ జి. హేమంత్ రెడ్డి తెలిపారు.ఐదుగురు మహిళా క్రీడాకారిణులు మాట్లాడుతూ కళాశాల కల్పిస్తున్న సౌకర్యాలపై తాము చాలా సంతోషంగా ఉన్నామని, క్రీడల్లో పాల్గొనేలా కళాశాల ఎల్లప్పుడూ విద్యార్థులను ప్రోత్సహిస్తుందని తెలియజేశారు.కళాశాల డైరెక్టర్ జి. హేమంత్ రెడ్డి మాట్లాడుతూ.. మహిళల కోసం సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ షటిల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ 2024-2025 కర్ణాటకలోని ధార్వాడ్లోని ఎస్డిఎం కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ - టెక్నాలజీలో విశ్వేశ్వరయ్య టెక్నలాజికల్ యూనివర్శిటీ




నిర్వహిస్తోంది,ఈ క్రీడాకారులు మా కళాశాల మరియు రాయలసీమ విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహించారు, అలాగే మా క్రీడాకారిణులలో ఒకరు మట్టే ఆకాంక్ష అనే క్రీడాకారిణి అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆడారు అని తెలిపారు.శ్రీ రామకృష్ణ విద్యా సంస్థల ఎస్టేట్ మేనేజర్ ఏ.ఎస్.ప్రగతిరెడ్డి మాట్లాడుతూ, ప్రతిభావంతులైన క్రీడాకారులతో కూడిన మహిళా జట్టుగా సంతోషంగా మన కళాశాల లో ఉందని, రాబోయే సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లలో మా సంస్థకు ప్రాతినిధ్యం వహించిన ప్రతిష్టాత్మక గౌరవం లభించిందని తెలిపారు.
శ్రీ రామకృష్ణ డిగ్రీ కళాశాల మరియు విశ్వవిద్యాలయానికి ప్రాతినిధ్యం వహించడానికి




వారిని పంపడం గర్వంగా ఉందని ఆమె అన్నారు అనంతరం కళాశాల చైర్మన్ ప్రొఫెసర్ జి రామకృష్ణారెడ్డి గారు ప్రసంగిస్తూ జాతీయ స్థాయి లో ప్రతిభ కనబరిచడానికి వెళ్లిన క్రీడాకారులను అభినందించి, శుభాకాంక్షలను తెలుపుతూ సౌత్ జోన్లో తమ నైపుణ్యాలను, జట్టుకృషిని ప్రదర్శించేందుకు మా మహిళా జట్టు సన్నద్ధమైందని అన్నారు. ఈ కళాశాలకు సంబంధించి వారికి టీ-షర్టులు కూడా స్పాన్సర్ చేసారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామక్రిష్ణ డిగ్రీ కళాశాల ఫ్యాకల్టీ లు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించండి..!

**-పిజిఆర్ఎస్ కు 124 దరఖాస్తులు. -జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల, నవంబరు 25:
ప్రజా ఫిర్యాదుల పరిష్కారంపై ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తున్న నేపథ్యంలో నాణ్యతతో నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. జాయింట్ కలెక్టర్ తో పాటు డిఆర్ఓ రాము నాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ ప్రజా సమస్యలకు అధిక ప్రాధాన్యతనిచ్చి సత్వరమే నిర్ణీత కాల వ్యవధిలోగా పరిష్కరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపాలని అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్ లో ఇంకా పెండింగ్లో ఉన్న 774 ఫిర్యాదులను బియాండ్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలన్నారు. వచ్చేవారం రాష్ట్ర ముఖ్యమంత్రి గారిచే జిల్లా కలెక్టర్ల కాన్ఫరెన్స్ ఉండే అవకాశం ఉందని ఈలోగా ఫిర్యాదులన్నీ క్లియర్ కావాలని జెసి తెలిపారు. రెవెన్యూ, సర్వే, పంచాయతీ రాజ్ ల, సివిల్ సప్లై, పోలీస్ తదితర శాఖలో అధిక సంఖ్యలో పెండింగ్ ఉన్నాయని ఆర్డీవోలు సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విథిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలన్నారు. సీఎమ్ఓ కార్యాలయపు ఫిర్యాదులు కూడ 67 పెండింగ్ లో వున్నాయని ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటూ పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ లో ఉన్న ఏపీ సేవా సర్వీసులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించి క్లియర్ చేయాలన్నారు. ఫ్రీ హెూల్డ్ భూముల రీసర్వే కి సంబంధించి సూచించిన నాలుగు ప్రొఫార్మా ల్లో వివరాలు పొందుపరిచి మంగళవారం సాయంత్రంలోగా అందజేయాలని ఆర్డిఓలు,




తాసీల్దార్లను జెసి ఆదేశించారు.

**ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన కొన్ని సమస్యలు**

1)గ్రామ,వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వైద్య శాఖ ఉద్యోగులకు ఈ నెల 30వ తేదీలోపు ఎన్పిసిఐ బ్యాంక్ అకౌంట్ మాప్పింగ్, జియో ట్యాగింగ్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసియున్నారని... ఇందుకు సంబంధించి పనులు పూర్తి చేసేందుకు మరి కొంత సమయం ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర ఉనైటెడ్ వార్డు మరియు గ్రామ హెల్త్ సెక్రెటరీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు.
2) ఆత్మకూరు మండలం నల్లకాలువ గ్రామ వికలాంగ వాస్తవ్యుడు వెంకటస్వామి ప్రభుత్వం తనకు మంజూరు చేసిన ట్రై సైకిల్ వినియోగించుటలో ఇబ్బంది పడుతున్నానని తనకు బ్యాటరీ ట్రై సైకిల్ మంజూరు చేయాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తును సమర్పించుకున్నారు.
3) పాణ్యం మండలం భూపనపాడు గ్రామానికి చెందిన సత్యారాజు తన తండ్రికి గ్రామ పొలిమేరలో సర్వే నంబర్ 136 లో 2.35 ఎకరాలు మరియు సర్వే నంబర్ 155 లో 2.35 ఎకరాల ఉందనీ తండ్రి మరణానంతరం తన తమ్ముడు ఎవరికీ తెలియకుండా తన పేరుమీద ఆన్లైన్ లో మరియు పట్టాదారు పాసుపుస్తకాలు చేయించుకున్నారని... సంబంధిత పొలాన్ని నా పేరు మీద కూడా ఆన్లైన్ చేయించడంతోపాటు పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ జాయింట్ కలెక్టర్ కు దరఖాస్తును సమర్పించుకున్నారు.
ఇంకా ఈ కార్యక్రమంలో 124 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జాయింట్ కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ విథిన్ ఎస్-ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ జేసీ ఆదేశాలు జారీ చేశారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# నలభై ఏళ్లుగా పనిచేస్తే 150 తో మొదలుకుని 9 వేలతో వెళ్లగొట్టారు.!

## -రైల్వే ఖ్వాజీ స్టాఫ్ కు ఉద్యోగ భద్రత కల్పించాలి.






ఆంధ్ర ప్రగతి కర్నూలు నవంబర్ 25:
రైల్వే ఖ్వాజీ స్టాఫ్ అసోసియేషన్ దక్షిణ మధ్య రైల్వే గుంతకల్ డివిజన్ జనరల్ బాడీ సమావేశం ఆదివారం గుంతకల్ పట్టణం లోని రైల్వే ఇన్స్టిట్యూట్ లో నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షులు కె రాజ్ కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ప్రముఖ సామాజిక ఉద్యమ కారులు యం డి ఆనంద్ బాబు ముఖ్య అతితిగా హాజరై మాట్లాడారు.

భారత ప్రభుత్వ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడుతున్న రైల్వే రంగంలో ఖ్వాజీ అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ చేత అధికారిక వెట్టిచాకిరి కొనసాగిస్తున్నారని యం డి ఆనంద్ బాబు విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం మరియు అధికారులు స్పందించి వారి బతుకుకు భద్రత కల్పించేలా.. శాశ్వత ఉద్యోగులుగా నియమించాలన్నారు. 40 సంవత్సరాల క్రితం రూ: 150/- లతో గుంతకల్ రైల్వే స్టోర్ లో ప్రారంభమైన యం వెంకటేశ్వర్లు అనే ఉద్యోగి జీవితం, 9000/- జీతం తో ముగించి, రెండున్నర సంవత్సరాల క్రితం ఎలాంటి బెనిఫిట్స్ గాని, సమాచారం గానీ లేకుండానే తొలగించారన్నారు. 2007 లో ఉమాదేవి వర్సెస్ రైల్వే బోర్డు మధ్య జరిగిన కేసు అనంతరం, బ్యాక్ డోర్ ఎంట్రీస్ ను ఆపుజేసీ, రాతపూర్వక ఎగ్జామ్ ద్వారా నియమించాలని సుప్రీంకోర్టు సూచించిందన్నారు. సుప్రీంకోర్టు తీర్పును మేము స్వాగతిస్తున్నామని, అయితే 2007 దాకా రైల్వే బోర్డునే నమ్ముకుని, భార్యాపిల్లలను పస్థులుంచుతూ వెట్టిచాకిరి చేస్తూ వచ్చిన ఖ్వాజీ ఉద్యోగుల బతుకు భద్రత పై ఎలాంటి నిర్ణయము తీసుకోలేదన్నారు. కానీ రైల్వే ఉన్నతాధికారులే 2007 నుండి 2020 వరకు సుప్రీంకోర్టు గైడెన్స్ ని కూడా పక్కనపెట్టి బంగ్లా ప్యూన్స్ తో పాటు, జి ఎం కోట కింద డైరెక్ట్ గా ఉద్యోగాలు ఇచ్చారన్నారు. ఉద్యోగ సంఘాలు సైతం కనీస మానవత్వ దృక్పథంతో స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. అధికారుల, పాలకుల కనికరానికి నోచుకోక కటిక దరిద్రం అనుభవిస్తున్న ఖ్వాజీ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. లేనిచో నేటితో ప్రారంభమైన ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా ఉన్న ఖ్వాజీలందరినీ కూడగట్టి మహా ఉద్యమంగా మారుస్తామన్నారు.

సమావేశంలో అసోసియేషన్ కార్యదర్శి ఇదూరుభాష, అసోసియేషన్ సభ్యులు గురుమూర్తి, రంగస్వామి, శ్రీనివాసులు, నరేష్, రామాంజనేయులు, అన్సర్ అలీ, లలిత, జలీల్, మోహన్, గంగాధర్, సయ్యద్ మునాఫ్, రాజశేఖర్, వీరేష్ గౌడ్, తో పాటు గుత్తి, గుంతకల్, డోన్, తిరుపతి స్పోర్ట్స్ మరియు ఇన్స్టిట్యూట్ నుండి హాజరైన ఖ్వాజీ స్టాఫ్ పాల్గొన్నారు.

# మాతృభూమి ఋణం తీర్చుకునేందుకు తానా సభ్యులు ముందుకు రావాలి.

## -అమెరికాలో తానా సభ్యులనుద్దేశించి ప్రసంగిస్తున్న నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా నవంబర్ 25:
తెలుగు రాష్ట్రాలు, వెనుకబడ్డ ప్రాంతాల అభివృద్ధికి అమెరికా తెలుగు అసోసియేషన్ సభ్యులు కృషి చేసి మాతృభూమి ఋణం తీర్చుకోవాలని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి పిలుపునిచ్చారు. 79 వ యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ సమావేశాలు అమెరికాలోని న్యూయార్క్ నగరంలో జరుగగా భారత ప్రతినిధిగా నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి వెళ్లి ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశం అనంతరం అమెరికా తెలుగు అసోసియేషన్ ( తానా ) ప్రతినిధుల ఘన సన్మాన సభలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కీలకోపన్యాసం చేశారు. తానా ప్రతినిధులు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరికి ఘన స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు.

# అగ్ని ప్రమాద భాదితులకు నిత్యవసర సరుకుల సహాయం.

## -నంద్యాల సేవా సమితి అధ్యక్షులు సద్దాం హుసేన్.



**ఆంధ్ర ప్రగతి మహానంది మండలం నవంబర్ 25:** మహానంది మండలం గాజులపల్లె గ్రామంలో రెండు వారాల క్రిందట షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు గుడిసెలు కాలిపోయి మంటలు చెలరేగి సిలిండర్లు పేలి మొత్తం దగ్ధమై రెండు కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలాయి. ఈ సమాచారం తెలుసుకున్న నంద్యాల సేవా సమితి అధ్యక్షుడు సద్దాం కార్యదర్శి భరత్ రెండు కుటుంబాలకు నిత్యవసర సరుకులు మరియు వంట సామాగ్రి అందజేశారు. ఈ సందర్భంగా నంద్యాల సేవా సమితి అధ్యక్షుడు సద్దాం మాట్లాడుతూ ఇందుకు సహకరించిన దాతలు ఎన్నారై రవి కి మరియు మిత్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగేంద్ర ఫాస్ట్ ఫుడ్ కిరణ్, సిద్దు, ఆర్.ఎం.పి మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా మార్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయం.!

## -ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి కొండంత అండ.

## -నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , మార్కెడ్ సభ్యులు తులసి రెడ్డి.






**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ నవంబర్ 25:**
నంద్యాల ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.12 లక్షల 30 వేల రూపాయలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఆదేశాల మేరకు నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ , మార్కెడ్ సభ్యులు తులసి రెడ్డి చేతుల మీదుగా 16 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ , తులసి రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాన్ని ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ గా మార్చడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా ఉంటారన్నారు . కష్టాల్లో ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా ఉంటామని సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒక ఆర్థిక భరోసాను ఇచ్చారని పేర్కొన్నారు. ఆరోగ్య వంతమైన వ్యక్తులతోనే ఆనందమయ సమాజం సాధ్యమన్నారు. కుటుంబం ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబ సభ్యులందరూ ఆనందంగా ఉంటారని కుటుంబంలో ఒకరు అనారోగ్యం పాలైతే కుటుంబం మొత్తం చెందుతుందన్నారు. పేదలకు కష్టం వచ్చినప్పుడు వారికి అన్నీ విధాలుగా ఇంటి పెద్ద కొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా ఉంటారని గుర్తు చేశారు. అనారోగ్యానికి గురై కష్టాల్లో ఉన్న కుటుంబానికి ఆసుపత్రి ఖర్చులకోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందిస్తామని ఎన్నికల ముందు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇచ్చిన మాటను ప్రస్తుతం నెరవేర్చారని తెలిపారు .మనిషి సంపూర్ణంగా కోలుకోవాలని వారు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారు కావాలన్నదే ఈ కూటమి ప్రభుత్వం ఆశయం అన్నారు. అలాంటి కుటుంబాలకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక భరోసాను ఇస్తున్నారని తెలిపారు. అనంతరం నంద్యాల నియోజకవర్గం లోని 16 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జైనాబి , శ్రీదేవి , మిద్దె చిన్న హుసేని , కామిని మల్లికార్జున , కృపాకర్ , మంజుల సుబ్బరాయుడు , షేక్ మున్న , సాయిరాం , నాగరత్నమ్మ మరియు టిడిపి నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీలకు సౌర విద్యుత్

## - చంద్రబాబు

పాడేరు, నవంబరు 25 : పేద షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగల లబ్దిదారులకు సౌర విద్యుత్తు అందించడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్లు, ఐటిడి ఏ పి ఓలు, గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు, ఎపి ఇపిడిసి ఎల్ అధికారులతో అమరావతి నుండి సోమవారం సోలార్ విద్యుత్తు సౌకర్యం, రాయితీలు పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీ ఎం మాట్లాడుతూ 200 యూనిట్లు లోపు వినియోగిస్తున్న లబ్దిదారులకు ఉచితంగా విద్యుత్తును అందిస్తున్నామన్నారు. సౌర విద్యుత్తు ఏర్పాటు చేసుకోవడానికి ఆసక్తి చూపించే లబ్దిదారులకు రాయితీలు అందిస్తామన్నారు. లబ్దిదారులకు ఇంటి పైకప్పుపై సోలార్ ప్లేటులు ఏర్పాటు చేయడానికి అవసరమై స్థలం ఉండాలన్నారు. 1 కిలో వాట్ సౌర విద్యుత్తు ఏర్పాటు చేయడానికి రూ.50 వేలు ఖర్చవుతుందని రూ.30 రాయితీ అందిస్తామని రూ.20 వేలు చెల్లించాలని అన్నారు. 2 కిలో వాట్ల సోలార్ కు రూ.60 వేలు రాయితీ, రూ.40 వేలు లబ్దిదారుని వాటాగా చెల్లించవలసి ఉంటుందన్నారు. 3 కిలో వాట్ల పై బడిన సోలార్ విద్యుత్తు ఏర్పాటు చేసుకునే వారికి రూ.78 రాయితీ ఇస్తామని రూ.1లక్ష 45 వేలు లబ్దిదారుడు చెల్లించాలన్నారు.

# రాష్ట్రం బాగుండాలని కూటమి ప్రభుత్వానికి మైనార్టీలు మద్దతు ఇచ్చారు.!

## -ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, మంత్రి లోకేష్ కు ధన్యవాదాలు.

## -ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్.






ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ నవంబర్ 25:
నంద్యాల పట్టణంలో 5 వ వార్డ్ నడిగడ్డ ఫాతిమా మజీదు కమిటీ సభ్యులు మరియు వార్డు ప్రజలు మరియు నందమూరి నగర్ వార్డు ప్రజలు ఆహ్వానం మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ ని దృశ్యాలువతో సన్మానించి గజమాల వేసి ఘన స్వాగతం పలికారు .ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మరియు తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు మౌలానా ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ముస్లిం మైనార్టీ సోదరులు ఎంతో వివక్షకు గురి అయి ముస్లిం మైనార్టీ సోదరులకు రావలసిన పథకాలు అందక సామాజికంగా ఆర్థికంగా వెనకబడి పోవడం జరిగింది. 2014లో తెలుగుదేశం ప్రభుత్వం ముస్లిం మైనా ర్టీ సోదరులకు ఒక స్వర్ణ యుగంలా ఉండేది. ముస్లిం మైనార్టీల ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి ఎన్నో సంక్షేమ పథకాలు, ఆడపిల్లల వివాహాలకు దుల్హన్ 50 వేలు, దేశ చరిత్రలో ఎక్కడ లేని విధంగా ఇమాం మౌజనులకు జీతాలు, షాది ఖానాలు, ఈద్గాలు, మదర్సాల నిర్మాణం ఎన్నో పథకాలు అందేవి, మాయమాటలతో గద్దెనెక్కిన జగన్మోహన్ రెడ్డి ముస్లిం మైనార్టీలకు ద్రోహం చేశారు. అది తెలుసు కున్న ముస్లిం మైనార్టీ సోదరులు 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ పక్షాన నిలబడి చంద్రబాబు ని ముఖ్యమంత్రిగా చేసుకున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 150 రోజుల్లోనే ఎన్నో సంక్షేమ కార్యక్ర మాలకు శ్రీకారం చుట్టిన చంద్రబాబునాయుడు, ముస్లిం మైనార్టీల కూడా అండగా ఉంటామని భరోసానివ్వటం మా అదృష్టంగా భావి
స్తూ నన్ను రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఎన్నుకున్నందుకు ఆయన కు ధన్యవాదాలు తెలిపారు.
రాష్ట్రం బాగు పడాలన్నా ,అభివృద్ధి జరగాలన్న విజన్ లీడర్ చంద్రబాబు తోనే సాధ్యం అని ప్రజలందరూ నిరూపించారని అన్నారు.రాష్ట్ర భవిష్యత్తు,ప్రజలకోసం ప్రాణాలకు తెగించి పోరాటాలు చేశానని అన్నారు.రాష్ట్రంలో వైసిపి పాలనలో మైనారిటీలపై ఎక్కడ దాడులు జరిగినా వారికి మద్దతుగా నిలచానని అన్నారు.
ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఖాజా ఫరీద్, అబ్దుల్ రషీద్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ఖాజా హాఫిజ్, తెలుగుదేశం పార్టీ మైనార్టీ నాయకులు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.